

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ



**రిం ఝిం గిరె సావన్, సులగ్ సులగ్ జాయే మన్**

**భీగె ఆజ్ ఇస్ మౌసం మే, లగీ కైసి యే అగన్**

ఎండలు మండిస్తున్నప్పుడు వర్షం కోసం మనస్సు, తనువు తపిస్తాయి. వర్షపు చిరుజల్లు జ్ఞప్తికి రావటం తోటే, చల్లని గాలిలో తేలివచ్చే చల్లని చినుకులు శరీరాన్ని తాకుతున్న భావన కలిగి మనస్సు మారుస్తుంది. మన సినిమాల్లో వర్షమత్యంత ప్రాధాన్యం వహిస్తుంది. వర్షం ఎన్నో రకాల భావాలను కలిగిస్తుంది. వర్షం సినిమాలో ఎన్నెన్నో భావనలకు ప్రతీకగా పనికొస్తుంది.

'బర్సాత్' సినిమాలో వర్షం పడటం నాయకానాయకుల రొమాంటిక్ కలయికకు నాందీ ప్రస్తావన అయింది.

**బర్సాత్ మే హం సె మిలే తుం సజన్,**

**తుం సె మిలే హం బర్సాత్ మే.**

సినిమాల్లో నాయికా నాయకులు కలిస్తే వర్షం కురుస్తుంది. కురిసే వర్షంలో తడుస్తూ పాటలు పాడతారు. ఆ పాటలు ప్రేక్షకుల గుండెల్లో రొమాంటిక్ భావనల చిరుజల్లు కురుస్తుంది.

**కురిసింది వాన నా గుండెలోనా**

**నీ చూపులే జల్లుగా!**

ఎంత రొమాంటిక్ భావన. ఆమె చూపులు జల్లుగా, అతని గుండెలో వాన కురిసిందట. ఇలాంటి పాటలు వింటూంటే నిజంగానే మనస్సులో శృంగార భావనల విరిజల్లు కురుస్తుంది. మధుర భావాల సుమమాలలు మనసులో వెల్లి విరుస్తాయి.

**చిటపట చినుకులు పడుతూ ఉంటే,**

**చెలికాడే సరసన ఉంటే,**

**చెట్టాపట్టగ చేతులు పట్టి, చెట్టు నీడకై పరుగులు తీస్తే**

**చెప్పలేని ఆ హాయీ ఎంతో వెచ్చగ ఉంటుందోయీ.**

కొన్ని తరాలకు శృంగార భావనల రూపును నిర్వచించిందీ పాట. ఆకాశం మేఘామృతమవుతూంటేనే. మనసున మనసై, బ్రతుకున బ్రతుకైన వారు పక్కన తోడుగా ఉంటే ఎంత బాగుంటుందన్న భావన కలుగుతుంది. అలాంటి వారు పక్కన లేకపోతే మనసు తీయని బాధతో మూల్గుతుంది. వారి సాంగత్యం కోసం, సాన్నిహిత్యం కోసం మనసు తపిస్తుంది. అయితే యవ్వనంలో ప్రతి యువకుడి కల వర్షం కురిసిన రాత్రి ఓ అందమైన యువతి తోడు ఉండటం.

**ఎక్ లడ్‌కీ భీగీ భాగీ సీ,**

**సోతీ రాతోం మే జాగీ థీ**

**మిలి ఎక్ ఆజనబీ సే, కోయీ ఆగేన పీఛే**

**తుం హి కహో యే కోయి బాత్ హై**

కిషోర్ కుమార్ తన స్వరంలో రహస్య భావనను ఇముడుస్తూ, రొమాంటిక్ ఆశలను నింపుతూ, అత్యద్భుతంగా పాడిన పాట ఇది. ఆ కాలంలోనే కాదు ఈ కాలంలో కూడా విన్న వారి మది అందమైన ఆలోచన్ల మందహాసాలతో నిండిపోతుంది. అయితే, మన సినీ కళాకారులకు వర్షంలో ఓ అందమైన అపరిచితురాలు పరిచయం అవటం గొప్ప రొమాంటిక్ సినిమాలకు నాందీ ప్రస్తావనలాంటిది.

జిందగీ భర్ నహీన్ భూలేన్గీ వో బర్సాత్‌కి రాత్

ఏక్ అంజాన్ హసీనా సే ములాకాత్ కి రాత్

జీవితాంతం, ఆ అందమైన వర్షపు రాత్రిని మరువలేడట ఆ యువకుడు. ఎందుకంటే, ఆ రాత్రి ఓ అందమైన అపరిచితురాలు, పరిచయమైన రాత్రి. కాబట్టి ఆ రాత్రిని మరువలేడు. ఇంతకీ రాత్రి ఏం జరిగింది?

**హాయ్ వో రేష్మీ జుల్ఫోంసె బరస్ తా పానీ**

**ఫూల్ సే గాలోంసె రుక్ నే కొ తరస్తా పానీ**

**దిల్ మె తూఫాన్ ఉఠాతే హుయే జజ్బాత్ కి రాత్.**

ఎంత అద్భుతంగా వర్ణించాడో, అందమైన వర్షపురాత్రి కలిసిన ఆ అపరిచితను. పట్టుకుచ్చుల్లాంటి ఆమె వెంట్రుకలనుంచి నీరు వర్షిస్తోందట. పూలలాంటి బుగ్గలపైన ఆగిపోవాలని తపన పడుతున్నాయట నీటి బిందువులు. అతని హృదయంలో సున్నిత భావాల తుఫాను రేపుతోందట ఆ వర్షపు రాత్రి. అంతటితో ఆగితే అది యువ హృదయాలలో శృంగార భావాల పన్నీటి జల్లు కురిపించే అద్భుతమైన వర్షపు రాత్రి ఎలా అవుతుంది?

**డర్ కె బిజ్‌లీ సె అచానక్ వో లిపట్‌నా ఉస్కా**

**ఔర్ ఫిర్ షర్మ్ సే,బల్కాకే సిమట్‌నా ఉస్కా**

**కభీ దేఖీన,సునీ ఇసీ తెలిస్మాత్‌కి రాత్!**

వర్షం కురుస్తోందంటే ఉరుములు, మెరుపులు ఉంటేనే మజా. ఆ ఉరుములు, మెరుపులకు బెదరి , యువతి, యువకుడిని భయంతో హత్తుకోవటం మరింత అద్భుతం. అలా హత్తుకుని వెంటనే తెలివి తెచ్చుకుని సిగ్గుతో దూరం జరగటం, స్వర్గమే. కలలాంటి భావన, నిజమైతే.

**సుర్ఖ్ ఆచల్ కో దబాకర్ జో నిఛోడా ఉస్నే**

**దిల్ పే జల్తా హువా ఎక్ తీర్ సా ఛోడా ఉస్నే**

**ఆగ్ పానీ మే లగాతే హువే హాలాత్ కి రాత్.**

వర్షంలో తడిసింది అమ్మాయి. తడిచిన కొంగునీటిని పిండుతోంది. చూస్తున్నది కవి కదా! కొంగు నుంచి నీటిని పిండటం, వెదజల్లటం, దులపటం, అతని హృదయానికి గాయం చేసే బాణాన్ని వదిలినట్టుందట. నీటిలో సైతం నిప్పును రగిలించే మనోహరమైన మంత్రమయమైన అత్యంత ఆనందకరమైన వర్షపు రాత్రి అది అంటున్నాడు. అయితే, ఈ అందమైన వర్షపు రాత్రిలో అందమైన అమ్మాయిని, అదీ వర్షంలో సంపూర్ణంగా తడిసిన అమ్మాయిని చూస్తూ పరవశిస్తుంది కవి. కవి, ఈ అమృతతుల్యమైన సంఘటన నుండి ప్రేరణ పొందకపోతే ఎలా?

**మేరె నగ్మోం జో బస్తీ హై వో తస్వీర్ థీ వో**

**నౌజవానీకి హసీన్ ఖ్వాబ్ కి తాబీర్ థీ వో**

**ఆస్మానోం సె ఉతర్ అయిథీ వో జోరాత్ కి రాత్**

అతని కవితల్లో ఎలాంటి యువతి రూపు నిగూఢంగా ఉంటుందో అలాంటి రూపు చిత్రం ఆమె. యువ హృదయాల అందమైన కల ప్రతిరూపం ఆమె. ఆకాశం నుంచి అప్సరస దిగి వచ్చిన అందమైన రాత్రి కల అది. ఇంత గొప్పగా వర్షపు రాత్రి అందమైన అమ్మాయి కలసిన అనుభవాన్ని మరెవరూ వర్ణించలేరు. అయితే ఆ అమ్మాయి అపరిచితలాగానే ఉండిపోయింది. అతని మదినిండా నిండిపోయి, జీవితాంతం మరుపురాని మధురమైన అనుభవానికి కారణమైన ఆ అమ్మాయి మళ్లీ ఎక్కడయినా, ఎప్పుడయినా కలిస్తే ఆ కవి ఏమంటాడు?

**మైనె షాయద్ తుమ్హే పహెలే భి కహీ దేఖాహై**

'నిన్ను ఎక్కడో చూసినట్టుంది' అంటున్నాడు. ఇక్కడే కవి గొప్పతనం తెలుస్తుంది. ఆమె ఎవరో చూడగానే గుర్తుపట్టాడు. కానీ ఎలా పలకరిస్తాడు? ఆమెతో ఆ అందమైన రాత్రి ప్రస్తావన ఎలా తెస్తాడు? ఆ రోజు మెరుపుకి చెదిరి తనై హత్తుకుందని గుర్తు తెస్తాడా? కొంగు నుంచి నీటిని పిండి జాలువారే నీటి బిందువులను మన్మధ బాణాలు చేసి వేసి గుండెను గాయపరిచిందని గుర్తుచేస్తాడా ? అలా గుర్తు చేస్తే మరో మాటకు అవకాశం ఇవ్వకుండా 'ఛీ పోరా వెధవా' అంటుంది. అందుకని, ఆమె తనకు గుర్తున్నా, ఆమె దర్శనం కోసమే తపిస్తున్నా, ఆ రాత్రి అనుభవాన్ని అనుక్షణం గుర్తు

చేసుకుంటున్నా, ఆ విషయం బహిరంగంగా చెప్పలేదు. అందుకని నర్మగర్భితంగా, సున్నితంగా, ఆమె తనకు గుర్తున్నదని కవిత రూపంలో చెప్తున్నాడు కవి, నిన్ను ఎక్కడో చూసినట్టుందని నెమ్మదిగా అసలు విషయం చెప్తున్నాడు.

**ఆజ్‌న బీ సీ హో, మగర్ గైర్ నహీ లగ్తీ హో**
**వహం సేభీ జో నాజూక్ హో, వొ యకీన్ లగ్తీ హో**
**హాయ్ యే ఫూల్ సా చెహరా, యె, ఘనేరీ జుల్ఫే**
**మేరేషేరోంసే భీ తుం ముఝ్‌కో హసీన్ లగ్తీ హో**

అపరిచితురాలయినా పరిచయమైన దానిలానే ఉంది. 'వహం' అన్నది గమ్మత్తయిన పదం. 'వహెం' అంటే అనుమానం, అపనమ్మకం, గుడ్డినమ్మకం, అపోహ వంటి పలు విభిన్నమైన అర్థాలున్నాయి. అపనమ్మకం, అంథ విశ్వాసం, పొరపాటుగా అర్థం చేసుకోవటం, అపోహల అంటి అతి సున్నితమైన భావనలకన్నా సున్నితమైన విశ్వాసం ఆమెపై కలుగుతున్నదట. ఆమె పూవువంటి వదనం, నల్లటి కురులు చూస్తూంటే, తాను రాసిన కవితలకన్నా అందంగా, అద్భుతంగా ఉందట ఆమె. ఇప్పుడు అసలు విషయానికి వస్తున్నాడు.

**దేఖ్ కర్ తుంకో కిసీ రాత్ కి యాద్ ఆతీ హై**
**ఏక్ ఖామోషీ ములాకాత్ కి యాద్ ఆతీహై**
**జహన్ మేహుస్న్ కీ ఠండక్ క అసర్ జాగ్తా హై**
**ఆంచ్ దేతీ హువీ బర్సాత్‌కి యాద్ ఆతీ హై**

ఆమెను చూస్తే అతని ఓ రాత్రి గుర్తుకు వచ్చిందట. ఓ నిశ్శబ్ద కలయిక గుర్తుకు వచ్చిందట. అతని హృదయంలో, మెదడులో అందం వల్ల చల్లని శాంతి భావన కలుగుతుందట. వేడి పుట్టించే వర్షం గుర్తుకు వస్తుందట. ఇంతకన్నా గొప్పగా వర్షపు రాత్రి తొలి నిశ్శబ్ద కలయికను వర్ణించలేరు. అంత అద్భుతం మన సినిమాలలో వర్షం.

పురుషులే కాదు స్త్రీలు కూడా వర్షాన్ని చూపి పరవశిస్తారు. రొమాంటిక్ భావనలలో మునిగి తేలతారు.

**ఓసజ్‌నా, బర్ఖా బహార్ ఆయి**
**రస్‌కీ పుహార్ లాయి, అఖియోమె ప్యార్ లాయీ...**

పరమాద్భుతమైన పాట ఇది. చూరునుంచి నీటిధారలు జాలువారుతూంటే, సుందర వదన సాధన, ప్రియుడిని తలచుకుంటూ ఈ వర్షంలో దాహంతో నా నయనాలు, నీ కలలే కంటున్నాయని అనటాన్ని మించిన రొమాన్స్ ఈ ప్రపంచంలో ఇంకేమీ లేదు. ఈ పాటలో సితార్లు, వయొలిన్లు, సాక్స్‌ఫోన్లతో సహా పలు వాయిద్యాలు విదేశీ సింఫోనీ

తరహా కలసి, విడిపోతూ, మ్రోగుతూ వర్షం కురిసే దృశ్యాన్ని హృదయంలో నిలుపుతాయి. అత్యంత సున్నితమైన భావనలను తట్టిలేపుతాయి.

కాలి ఘటా ఛాయ్ మోర జియ్యా తర్సాయే/'ఐసే మే కహి కోయి మిల్‌జాయే..

ఆకాశంలో నల్లటి మేఘాలతో నిండి హృదయాన్ని తపించేస్తోందిట. ఈ సమయంలో మనస్సు ఓ అజ్ఞాత యువకుడిని తపింపచేస్తోందిట. ఈ సమయంలో మనస్సు ఓ అజ్ఞాత యువకుడిని కలవాలని తపిస్తోంది. ఎవరయినా కలవాలని కోరుతోంది.

**బూందే నహీ సితారే, టప్ కేహై కహకషాసే**

**సద్ కే ఉతర్ రహే హై , తుం పర్, యే ఆస్మాన్ సే**

వర్షంలో తడుస్తున్న ప్రేయసిని చూస్తూ, మైమరచి పోయిన యువకుడి హృదయపు స్వరం ఇది. పై నుంచి కురుస్తున్న చినుకులు, వర్ష నీటి బిందువులు కావట. అవి తారకలట. అద్భుతమైన ఊహ. ఆకాశం నుంచి తారకలు కురుస్తున్నాయట.'కహకషా' అంటే galaxy పాలపుంత. ఇంత తన్మయమైన స్థితిలో కూడా ఔచిత్యం కోల్పోలేదు కవి. మన ఆకాశంలో ఉన్నది ఒక తార, సూర్యుడు. కానీ పాలపుంతలంటే నక్షత్ర సమూహాలు. కాబట్టి ఆమెని చూసి ఆశ్చర్యంతో, నక్షత్ర సమూహాల నుండి నక్షత్రాలు దిగి వచ్చి ఆకాశం నుండి ఆమెపై కురుస్తున్నాయట. ప్రేయసిపై పడే వర్షపు చినుకులను పాలపుంత నుండి రాలుతున్న నక్షత్రాలుగా ఊహించిన ప్రియుడి ఉన్మత్త ఊహాశాలిత్వానికి జోహార్లు పలకకుండా ఉండలేము.

అయితే, వర్షం, ప్రేయసి ప్రియులు, రొమాన్స్‌కి ప్రతీకగానే కాదు అత్యుత్తమంగా ప్రామాణికంగా నిలచిన పాట 'ప్యార్ హువా, ఇక్ రార్ హువా' పాట ఈ పాటలో వర్షం ప్రసక్తి లేదు. కానీ ప్రేమ ఉంది, ప్రేమను స్వీకరించటం ఉంది ప్రేమ భవిష్యత్తు గురించి భయం ఉంది. ప్రేమ ఫలితం పట్ల అవగాహన ఉంది. 'మై న రహూంగి, తుం న హోగే ఫిర్‌భి రహేగి నిషానియా' నువ్వుండవు, నేనుండను కానీ మన ప్రేమ గుర్తుగా మన సంతానం ఉంటుంది, అంతే. అవగాహన, చైతన్యం, దూరదృష్టి ప్రదర్శించిన ఏకైక రొమాంటిక్ గీతం ఇది. అందుకే ఒక ఉత్కృష్ట మైన స్థానాన్ని, ప్రామాణికతను సాధించిందీ పాట.

**అబ్ కే సావన్ మే జీ డరే**

**రిం ఝుం తన్ పే పానీ గిరే**

**మన్‌మే లగీ, అగ్ సీ.**

వర్షఋతువును చూసి హృదయం భయపడుతుందట. శరీరం పై వర్షపు చినుకులు పడుతూంటే. హృదయంలో అగ్నిరాజుకుంటున్నదట. ఇది ఒకప్పటి యువతరం ప్రేమ పాట. కాస్త పరిణతి చెందిన మనసులు ఇదే భావనను మరింత కవితాత్మకంగా, కాళిదాసులా వ్యక్తపరుస్తారు, మేఘ సందేశాలతో..

**మేఘారే, మేఘారే, మత్ పర్‌దేశ్ జారే**

**ఆజ్ తూ ప్రేంక సందేశ్ బర్సారే...**

ఓ మేఘమా, మమ్మల్ని వదిలి వేరే దేశం వెళ్లకూ, ఈ రోజు, ఇక్కడే నువ్వు ప్రేమ సందేశాన్ని వర్షించు అని వేడూకుంటున్నారు ప్రేయసీ ప్రియులు.

**బర్సో రే మేఘ మేఘ**

**బర్సో రే మేఘ బర్సో**

**మీఠా హై కోసా హై, బారిష్ కబోసాహై**

**జల్ జల్ జల్ జల్ థల్**

**చల్ చల్ చల్ చల్ బహ్తో చల్**

**నన్నారే నారే. నన్నారె నన్నారే.....**

వర్షం తీయగా ఉందట. 'కోసా' పదం పలురకాల అర్థాలు కలది. లార్వాలు ఉండే గూటిని 'కోసా' అంటారు. అన్ని వైపుల నుంచి చుట్టు ముట్టటాన్ని 'కోసా' అంటారు. ముత్యాన్ని 'కోసా ' అంటారు. గీకటాన్ని 'కోస' అంటారు. అత్యంత మార్మికమూ, సంక్లిష్టమైన అర్థాలలో పదాలను వాడటం గుల్జార్‌కి అలవాటు. ఆయన ఒకోసారి పదాలకు శబ్దాల అర్థాన్ని దృశ్యరూపంలో ప్రదర్శిస్తూ వాడతాడు. ఇక్కడ 'కోస ' అంటే, అమ్మాయిని వర్షం చుట్టు ముట్టిందన్న అర్థం వస్తుంది. అమ్మాయిని గూటిలో బందించినట్టు వర్షం బంధించిందన్న అర్థం వస్తుంది. ముత్యాల్లాంటి చినుకులు అన్న అర్థం వస్తుంది. వర్షం శరీరాన్ని తాకుతూ జాలువారుతోందన్న అర్థం వస్తుంది. వర్షపుజల్లు వేగవంతంగా శరీరాన్ని తాకినప్పుడు 'గిచ్చి'నట్టు అనిపిస్తుంది. తియ్యటినొప్పి కలుగుతుంది. 'మీఠా హై కోసా హై' అనటంతో ఈ అర్థం కవి హృదయానికి దగ్గరగా ఉన్నట్టు అనిపిస్తుంది. 'బారిష్ కా బోసా' మళ్లీ పలు అర్థాల పదం. 'బోసా ' అంటే, మత్తునిచ్చే ద్రావకం. 'మత్తు వర్షం', ఆకాశాన్నించి జాలువారే వర్షపు నీరు మత్తును కలిగించేట్టుందని భావించవచ్చు. కానీ అత్యద్భుతంగా ఉంటుందీ పాట వింటూంటే. పాటలో వేగం ఉంది. ఉద్వేగం ఉంది. కానీ రొమాన్స్ లేదు.

**దిల్ యే బేచైన్ వే, రస్తేపే నైన్ వే,**

**జిందడీ బేహాల్‌హై, సుర్ హైన తాల్‌హై**

**ఆజా సజన్ ఆ..ఆ..ఆ... తాల్ సె తాల్ మిలా...**

ఈ పాటలో వర్షపు లయ ఉంది. పాటలో  వర్షపు మృదుత్వం ఉంది. రొమాంటిక్ భావనల సున్నితత్వం ఉంది. హృదయం అశాంతిగా ఉంది. దారినే చూస్తున్నాయి కళ్లు,  ఎవరో రావాలని, వస్తారని. జీవితంలో అశాంతి ఉంది. ఒక లయ లేదు. రాగం లేదు. అంటే అంత రసవిహీనంగా ఉందన్నమాట జీవితం. కాబట్టి ప్రియుడిని రమ్మని పిలుస్తోంది ఆమె హృదయం. వచ్చి తన హృదయ లయతో, అతని హృదయ లయను జతపరచమంటోంది..

అయితే, ప్రతి యువకుడి హృదయం, వర్షం పడేప్పుడు, తనతో ఉన్న యువతి ఎప్పటికీ వెళ్లకూడదని వర్షం పడుతూనే ఉండమని కోరుతుంది.

**బర్ఖరాని జర  జం కె బర్సో.**

**మేర దిల్ భర్ జాన పాయే ఝూం కర్ బర్సో**

**యే అభీతో ఆయెహై కహతెహై హం జాయె హై**

**తూ బరస్ బర్సో బరస్,  యే ఉమ్ర్ భర్‌నా జాయెరే..**

ఆమె అప్పుడే వచ్చి వెళ్లిపోతానంటోంది. కాబట్టి సంవత్సరాల తరబడి వర్షించు. ఒక జీవితకాలం వర్షించు. ఈమె జీవితకాలం ఎక్కడికీ వెళ్లకుండా నాతోనే. ఉండేట్టు వర్షించు అంటున్నాడు నాయకుడు.

అయితే, ఎన్నెన్ని భాషల్లో ఎన్నెన్ని అద్భుతమయిన పాటలువిన్నా, ఎన్నెన్ని అద్భుతమయిన భావాలను చిలికే పాటలను విన్నా, మనసును మురిపించే ప్రకృతి దృశ్యాలు వర్షపు ధారకు శుభ్రమవుతూ, పవిత్రమవుతున్న అందమయిన ప్రకృతిని చూసినా, గీతాంజలి సినిమాలో వేటూరి రాయగా ఇళయరాజా స్వరబద్ధం చేసిన ఈ పాటను మాత్రం మించదు. పాటలో వర్షపు లయ వుంది. వాయిద్యాలలో వర్షపు జల్లులోని ఉధృతి వుంది. ఉక్కిరిబిక్కిరిచేస్తూ కూడా హాయినందించే లక్షణం వుంది. పాటలో పదాలలోని ఊపు వర్షంలోని నీటిబిందువుల సమష్టి ధారా శక్తి వుంది. అసలు వర్షాన్ని కళ్ళముందు నిలిపి హృదయంలో వర్షాన్ని కురిపించగల శక్తివంతమయిన దృశ్యాలను పదాలు చిత్రిస్తాయి. ఒక యువతి, ప్రధమ యవ్వన సంజనిత అలవికాని అనుభూతులు, సంవేదనల తాపాన్ని వర్షపు ధారా స్పర్షలో అవగాహన చేసుకుంటూ, అప్పుడే విరిసిన తామరలోని స్నిఘ్ధత్వాన్ని ప్రతిబింబిస్తూ పాడిన పరమాద్భుతమయిన పాట. పాశ్చాత్య స్యంఫోనీలతో పోటీపడే వాయులీనాల నర్తనంతో కూడిన ఈ పాట ప్రతి వర్షపు జల్లులో హృదయమంతా తుళ్ళింతలు, మనసంతా ఇంద్రధనస్సులను వెల్లివిరియింపచేస్తుంది.

**జల్లంత కవ్వింత కావాలిలే/ఒళ్ళంత తుళ్ళింత రావాలిలే**

**ఉరుకులో పరుగులో/ఉడుకు వయసు దుడుకుతనము నిలువదు**

తొలకరి మెరుపులా/ఉలికిపడిన కలికి సొగసు

కొండమ్మ కోనమ్మ మెచ్చిందిలే/ఎండల్లో వెన్నెల్లు తెచ్చిందిలే

వాగులు వంకలు జలజలా చిలిపిగా పిలిచినా

గాలులు వానలు చిటపటా చినుకులే చిలికినా

మనసు ఆగదు ఇదేమి అల్లరో

తనువు దాగదు అదేమి తాకిడో

కోనచాటు కొండమల్లే లేనివంక ముద్దులాడి

వెల్లడాయె కళ్ళు లేని దేవుడెందుకో మరి

జల్లంత కవ్వింత కావాలిలే/ఒళ్ళంత తుళ్ళింత రావాలిలే

సందెలో రంగులే నొసటిపై తిలకమే నిలుపగా

తెలి తెలి వయసులే తెలియని తపనలే తెలుపగా

వానదేవుడే కళ్ళాపి జల్లగా/వాయుదేవుడే ముగ్గేసి వెళ్ళగా

నీలిమంట గుండెలోని ఊసులన్ని తెలుసుకున్న/కొత్త పాట పుట్టుకొచ్చె ఎవరికోసమో

మండే ఎండల నడుమ వర్షపు పాటల ఆలోచనలు కలిగించే చల్లదనం, కలిగిస్తున్న వెచ్చటి ఆలోచనల నడుమ ఈనెల వీడ్కోలు తీసుకుంటూ, జల్లంత కవ్వింతలు, ఒళ్ళంత తుళ్ళింతలతో , ఉరుకులు పరుగులమీద వేసవి వెళ్ళి

త్వరత్వరగా వానదేవుడు వచ్చి కళ్ళాపి చల్లాలని, వాయుదేవుడు ముగ్గేసివెళ్ళాలనీ, నీలిమంట గుండేలోని ఊసులన్ని తెలుసుకున్న కొత్త పాటలు చినుకు చినుకుకూ పుట్టాలనీ ఆశిస్తూ వచ్చే నెల మరిన్ని అందమైన  పాటల సుందరమైన ఆలోచనల పరిమళాలతో కలుద్దాం.

**వచ్చే నెల మరిన్ని మధురమైన గీతాలతో...**

Post your comments